# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం
17 ఫిబ్రవరి 2026




## గ్రామాభివృద్ధిలో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలి..!

**పాలేరు ఫిబ్రవరి 16( నినాదం)**

గ్రామాభివృద్ధి లో ప్రతీ ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని అమ్మగూడెం పంచాయతీ సర్పంచ్ పొట్ట లక్ష్మి సూచించారు. మండలం లోని అమ్మగూడెం లో సోమవారం సీసీ రోడ్ల నిర్మాణాకి శంఖుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె,మాట్లాడారు.గ్రామాభివృద్ధి కోసం పాలకవర్గం శక్తి వంచన లేకుండా కృషి చేయనున్నట్లు తెలిపారు. దీనికి తోడు అధికారులతో పాటు రాజకీయా లకు అతీతంగా ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. పంచాయతీ ని అన్ని రంగాలలో అభివృద్ధి చేసేందుకు కార్యాచరణ ను రూపొందించనున్నట్లు తెలిపారు. మండలం లో అమ్మగూడెం ను ఆదర్శ పంచాయతీ గా తీర్చిదిద్దేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంచాయతీ అభివృద్ధి కి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ వేణు, వార్డు సభ్యులు భవాని, కళ్యాణి. గ్రామ పెద్దలు చంద్రశేఖర్, వెంకటేశ్వర్లు: సత్యం. అడపాల'రవీందర్, సురేష్, రమణ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా శివ-పార్వతి కళ్యాణం

**అశ్వాపురం, ఫిబ్రవరి 16 (నినాదం):**

మహా శివరాత్రి సందర్భంగా మొండికుంట గ్రామంలోని శ్రీ సీతరామచంద్ర స్వామి ఆలయ ప్రాంగణంలో శివ–పార్వతుల కళ్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గ్రామానికి చెందిన భక్తులు భారీ సంఖ్యలో హాజరై భక్తి శ్రద్ధలతో పాల్గొన్నారు.ఉదయం నుంచే ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది. ప్రత్యేక పూజలు, అభిషేకాలు, వేద మంత్రాల మధ్య శివ–పార్వతుల కళ్యాణాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. పూలతో, విద్యుద్దీపాలతో ఆలయాన్ని సుందరంగా అలంకరించారు. భక్తులు ఉపవాస దీక్షలు పాటిస్తూ రాత్రి వరకు జాగరణ నిర్వహించి శివనామస్మరణలో మునిగిపోయారు.శివ–పార్వతి కళ్యాణం నిర్వహించడం వల్ల గ్రామానికి శాంతి, సుభిక్షం, ఆయురారోగ్యాలు కలుగుతాయని పెద్దలు విశ్వసిస్తున్నారు. కుటుంబ సౌఖ్యం, ఐక్యత, సిరిసంపదలు వర్ధిల్లాలని భక్తులు ప్రత్యేక ప్రార్ధనలు చేశారు. మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని మంగళహారతులు సమర్పించారు.కార్యక్రమం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గ్రామస్థుల సహకారంతో శివరాత్రి వేడుకలు ఘనంగా, భక్తిశ్రద్ధల మధ్య కొనసాగాయి.

# సామాన్యుడికే మేయర్ పట్టం

## కరీంనగర్ మేయర్‌గా కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసిన బీజేపీ నాయకత్వం

### మేయర్ అభ్యర్థి పేరును ప్రతిపాదించిన మాసం గణేశ్, శ్రీలేఖ
### ఏకగ్రీవంగా ఆమోదించిన బీజేపీ కార్పొరేటర్లు
### ఏబీవీపీ నుండి మొదలైన కొలగాని ప్రస్థానం
### రాష్ట్ర అధ్యక్షులు రామచంద్రరావుకు ధన్యవాదాలు తెలిపిన బండి సంజయ్



**కరీంనగర్, ఫిబ్రవరి 16(నినాదం)**

కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ 'మేయర్ పదవి సామాన్యుడికే దక్కింది. భారతీయ జనతా పార్టీ పక్షాన మేయర్ అభ్యర్థిగా 2వ డివిజన్ బీజేపీ కార్పొరేటర్ కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది. డిప్యూటీ మేయర్ గా మాజీ మేయర్ సునీల్ రావును ఎంపిక చేసింది. పార్టీ రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు ఈ మేరకు వారి పేర్లను ఖరారు చేస్తూ లేఖపై సంతకం చేశారు. బీజేపీ లీగల్ సెల్ రాష్ట్ర నాయకులు ఆంటోనీ రెడ్డి ఆ లేఖతో కూడిన కవర్ ను తీసుకుని సోమవారం రోజున ఉదయం కరీంనగర్ కు విచ్చేశారు. ఈ నేపథ్యంలో నగరంలోని వి.కన్వెన్షన్ లో బీజేపీ కార్పొరేటర్ల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, బీజేపీ జిల్లా బీజేపీ కరీంనగర్ జిల్లా ఇంఛార్జీ డాక్టర్ గంగిడి మనోహర్ రెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ల సమక్షంలో డాక్టర్ మనోహర్ రెడ్డి హైకమాండ్ ఖరారు చేసిన పేర్లను కార్పొరేటర్లకు తెలియజేస్తూ, వారి అభిప్రాయాలు చెప్పాలని కోరారు.వాస్తవానికి కరీంనగర్ మేయర్ పదవిపై బీసీ కార్పొరేటర్లంతా ఆశలు పెట్టుకున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకున్న జిల్లా నాయకత్వం బీసీ, జనరల్ స్థానాల్లో గెలుపొందిన బీసీ కార్పొరేటర్ల పేర్లను, వారి బయోడేటాను రాష్ట్ర నాయకత్వానికి పంపింది. ఆ జాబితాలో ఉన్న ఒక్కో కార్పొరేటర్ పేరును, పార్టీకి చేసిన సేవలు, ప్రజల్లో ఉన్న పేరును పరిశీలించింది. చివరకు ఏబీవీపీ నుండి రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టి కష్టపడి అంచలంచెలుగా ఎదిగిన సామాన్య కార్యకర్త కొలగాని శ్రీనివాస్ పేరును ఖరారు చేసింది.

**కొలగాని శ్రీనివాస్ ప్రస్థానం..**

37 ఏళ్ల కొలగాని శ్రీనివాస్ 1989 జూన్ కరీంనగర్ జిల్లా తీగలగుట్టపల్లిలో జన్మించారు. ఎంబీఏ, ఎంఎస్ డబ్ల్యూ చేసిన కొలగాని చిన్నప్పటి నుండే ఆర్ఎస్ఎస్ లో శాఖలో చురుకుగా పాల్గొనే వారు. 2013లోనే ప్రాథమిక శిక్షను పూర్తి చేశారు. చిన్ననాటి నుంచే స్వామి వివేకానంద ఆలోచనలతో ప్రభావితమై ఎన్ఎస్ఎస్, ఎన్ వైపీ, ఏక్తా పరిషత్ సంస్థల ద్వారా అనేక సేవా కార్యక్రమాల్లోనూ పాల్గొన్నారు. విద్యార్థి దశ నుండే రాజకీయాల పట్ల ఆసక్తి ఉండేది. 2005 నుండి 2007 వరకు అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ లో పనిచేసి విద్యార్థుల సమస్యలపై పోరాడారు. 2007 నుండి 2009 వరకు భారతీయ జనతా యువ మోర్చాలో పనిచేసి యువజన పోరాటాల్లోనూ పాలు పంచుకున్నారు. 2007 నుండి 2009 వరకు ఎన్ఎస్ఎస్ వలంటీర్‌గా పనిచేసి 2010లో కాకతీయ విశ్వవిద్యాలయం నుండి ఉత్తమ వలంటీర్ అవార్డును అందుకున్నారు. నేషనల్ యూత్ ప్రాజెక్టు చేరి దేశ సేవకు అంకితం కావాలని భావించిన కొలగాని 2009లో అసోంలో జరిగిన నేషనల్ ఇంటిగ్రేషన్ అండ్ పీస్ క్యాంప్ కు హాజరయ్యారు. లక్షద్వీప్, బెంగళూరు,



యూపీ, రాజస్తాన్, ఉత్తరాఖండ్, హర్యానా, అండమాన్ నికోబార్ లలో నిర్వహించిన అనేక జాతీయ స్థాయి శిబిరాల్లోనూ పాల్గొన్నారు. యువత, పిల్లలతోపాటు పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాల్లోనూ చురుకుగా పాల్గొనే వారు. ఇప్పటి వరకు 15 సార్లు రక్తదానం చేశారు. 2009 నుండి 2013లో ఏక్తా పరిషత్ కార్యక్రమాల్లో పాల్గొని ఆదివాసీల హక్కుల కోసం పోరాటం చేశారు. కొలగాని సేవలకు గాను 2005 లో భాయిజీ సేవా పురస్కార్ , 2010లో ఎన్ ఎస్ ఎస్ ఉత్తమ వలంటీర్, 2021, కరోనా కాలంలో అందించిన సేవలకుగాను కేంద్ర మంత్రి మనోహర్ లాల్ కట్టర్ చేతుల మీదుగా 'రక్షక్ అవార్డు'లను అందుకున్నారు.ఈ సందర్భంగా 39వ డివిజన్ కార్పొరేటర్ మాసం గణేశ్ మేయర్ అభ్యర్థిగా కొలగాని శ్రీనివాస్ పేరును ప్రతిపాదించగా, 62వ డివిజన్ కార్పొరేటర్ పెద్దపల్లి శ్రీలేఖ బలపర్చారు. అట్లాగే డిప్యూటీ మేయర్ అభ్యర్థిగా సునీల్ రావు పేరును 29వ డివిజన్ కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ప్రతిపాదించగా, 51వ డివిజన్ కార్పొరేటర్ భండారి వేణు బలపర్చారు. బీజేపీ సీనియర్ కార్పొరేటర్లు చొప్పరి జయశ్రీ, వాసాల రమేశ్ సహా బీజేపీ కార్పొరేటర్లందరూ కొలగాని శ్రీనివాస్, సునీల్ రావు పేర్లను మేయర్, డిప్యూటీ మేయర్ అభ్యర్థులుగా ఏకగ్రీవంగా ఆమోదిస్తున్నట్లు చప్పట్లతో తమ ఆమోదం తెలిపారు. అక్కడి నుండి నేరుగా ప్రత్యేక బస్సులో కరీంనగర్ మున్సిపల్ కార్పొరేషన్ కు విచ్చేసిన కార్పొరేటర్లంతా ప్రమాణ స్వీకారం చేశారు.

**షాక్ లో నూతన మేయర్ కొలగాని శ్రీనివాస్**

వాస్తవానికి మేయర్ అభ్యర్థి పదవి తనను వరిస్తుందని కొలగాని శ్రీనివాస్ అస్సలు ఊహించలేదు. ఈరోజు ఉదయం బీజేపీ కార్పొరేటర్ల సమావేశంలో పార్టీ జిల్లా ఇంఛార్జీ గంగిడి మనోహర్ రెడ్డి కొలగానిని మేయర్ అభ్యర్థిగా రాష్ట్ర నాయకత్వం ఖరారు చేసిందని తెలియజేయడంతో కొలగాని ఒక్కసారిగా ఆశ్చర్యానికి లోనయ్యారు. కార్పొరేటర్లంతా వచ్చి కొలగానికి అభినందనలు తెలియజేస్తున్న సమయంలోనూ ఆశ్చర్యం, ఆనందంతోపాటు ఆనందంతో చెమర్చిన కళ్లతో అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ప్రధాని నరేంద్రమోదీ, జాతీయ అధ్యక్షులు నితిన్ నబిన్, రాష్ట్ర అధ్యక్షులు ఎన్.రామచంద్రరావు, కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ లకు ప్రత్యేకంగా ధన్యవాదాలు తెలిపారు. సామాన్య కార్యకర్తనైన తనను మేయర్ కు ఎంపిక చేస్తుందని కలలో కూడా ఊహించలేదన్నారు. బీజేపీలో కష్టపడి, విధేయతతో పనిచేస్తే పదవులు వాటంతట అవే వస్తాయనే దానికి తానే నిదర్శనం అని చెప్పారు.
ఈ సందర్భంగా ఇంతటి బాధ్యత ను అప్పజెప్పిన రాష్ట్ర పార్టీకి, కేంద్ర మంత్రి బండి సంజయ్,జిల్లా పార్టీకి, కార్పొరేటర్లకు, కార్యకర్తలకు ధన్యవాదములు తెలిపారు.



## చేవెళ్ల చైర్ పర్సన్ ఏకగ్రీవం

### చైర్ పర్సన్ గా, దేవర సమత వెంకట్ రెడ్డి వైస్ చైర్మన్‌గా కాసుల రాములు గౌడ్ ప్రమాణ స్వీకారం

**చేవెళ్ల ఫిబ్రవరి 16 (నినాదం)**

ఇటీవల జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో గెలుపొందిన కౌన్సిలర్లకు, సోమవారం ప్రమాణ స్వీకారం అట్టహాసంగా సాగింది. రంగారెడ్డి జిల్లా,చేవెళ్ల పురపాలక సంఘం కార్యాలయంలో ప్రొసీడింగ్ అధికారి బి రంగారావు, మున్సిపల్ కమిషనర్ వెంకటేశం అధ్యక్షతన, ఉదయం 10 గంటలకు చేవెళ్ల మున్సిపల్ 18 మంది కౌన్సిలర్ ల,ప్రమాణ స్వీకారం చేయించారు.మధ్యాహ్నం 12 గంటల 30 నిమిషాలకు చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ ఎన్నిక ప్రారంభమయ్యింది. 16 వార్డు కౌన్సిలర్, దేవర సమతా వెంకటరెడ్డి పేరును, మున్సిపల్ చైర్ పర్సన్ గా (15 వ వార్డు) బండారి శైలజ నాగిరెడ్డి ప్రతిపాదించారు. (14వ వార్డు) కౌన్సిలర్ మద్దెల శ్రీనివాస్ బలపరిచారు. అదేవిధంగా 13 వార్డు కౌన్సిలర్ కాసుల రాములు గౌడ్ పేరును వైస్ చైర్మన్ గా,(8వ వార్డు) కౌన్సిలర్ ధవల్ గారి గోపాల్ రెడ్డి ప్రతిపాదించారు. (11 వ వార్డు) కౌన్సిలర్ ఫైండ్ల మధుసూదన్ రెడ్డి బలపరిచారు. దీంతో చేవెళ్ల మున్సిపల్ చైర్ పర్సన్ గా దేవర సమతా వెంకటరెడ్డి, వైస్ చైర్మన్ గా కాసుల రాములు గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. అనంతరం ఎన్నికైన చైర్ పర్సన్ సమతా వెంకటరెడ్డికి, వైస్ చైర్మన్ కాసుల రాములు గౌడ్ లకు సంబంధిత ధ్రువ పత్రాలను ప్రిసైడింగ్ అధికారి, బి రంగారావు అందించారు. అనంతరం చైర్ పర్సన్ సమతా వెంకటరెడ్డిని, వైస్ చైర్మన్ రాములు గౌడ్లను చేవెళ్ల శాసనసభ్యులు కాలె యాదయ్య, మాజీ ఎంపీ రంజిత్ రెడ్డి, హైదరాబాద్ మాజీ మేయర్ బొంతు రామ్మోహన్, చేవెళ్ల నియోజకవర్గం ఇంచార్జ్ పామేన భీమ్ భరత్,మొయినాబాద్ మాజీ జడ్పిటిసి కాలె శ్రీకాంత్ లు పూల బొకేలు, శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు.. ఈ కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, ఏఎంసీ చైర్మన్ పెంటయ్య గౌడ్, మాజీ టిఎస్పిఎస్ చైర్మన్ గోనె ప్రతాప రెడ్డి, మున్సిపల్ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ సీనియర్ నాయకులు పడాల ప్రభాకర్ జనార్ధన్ రెడ్డి మండల అధ్యక్షుడు వీరేందర్ రెడ్డి, మద్యల చింటూ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు పార్టీ కార్యకర్తలు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.



## శివాలయంలో ఘనంగా మహా అన్నదానం







### అన్నదాత కల్వగురి రాజు ముదిరాజు

**జవహర్ నగర్, ఫిబ్రవరి 16 (నినాదం):**

జవహర్ నగర్ లోని బీజేఆర్ నగర్ స్థానిక శివాలయంలో సోమవారం అన్నదాన కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. పుణ్యక్షేత్రంలో పర్వదినాన్ని పురస్కరించుకుని, కల్వగురి రాజ్ ముదిరాజ్అ న్నదానాన్ని ఏర్పాటు చేశారు. భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలుఉదయం నుంచే స్వామివారికి రుద్రాభిషేకాలు, బిల్వార్చనలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలిరావడంతో ఆలయ పరిసరాలన్నీ శివనామ స్మరణతో మారుమోగాయి. పూజా కార్యక్రమాల అనంతరం స్వామివారికి మహానైవేద్యం సమర్పించి, భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. వందలాది మంది బక్తులు తరలివచ్చరు, మధ్యాహ్నం ప్రారంభమైన అన్నదాన కార్యక్రమంలో సుమారు 1000,మందికి పైగా భక్తులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా క్యూ లైన్లు, నీడ కోసం పందిళ్లు మరియు త్రాగునీటి సౌకర్యాలను కల్పించారు. స్వచ్ఛంద గత 20 సంవత్సరాల నుండి భక్తులకు స్వయంగా భోజన వసతులను కల్పించి భక్తి భావం చాటుకుంటున్నారు, ఈ సందర్భంగా కల్వగురి రా జ్,ముదిరాజ్,మాట్లాడుతూ.. "ప్రతి ఏటా భక్తులకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని, అన్నదానం చేయడం వల్ల మానసిక ప్రశాంతత లభిస్తుందని" పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాజ్ ముదిరాజ్ కుమారులు, సాయి వెంకట్, ముదిరాజ్ పవన్ కుమార్ ముదిరాజ్ పాల్గొని కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు.

## పరిసరాలు పరిశీలిస్తూ... రోగులకు సేవలు

### హెల్త్ సెంటర్ లో కాయకల్ప బృందం క్షేత్ర స్థాయి పరిశీలన..!





**పాలేరు ఫిబ్రవరి 16( నినాదం)**

ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్ ను సోమవారం కాయకల్ప బృందం పరిశీలించింది. కాయకల్ప ఇంటర్నల్ అసిస్టెంట్ డాక్టర్.ముక్కంటేశ్వరరావు బృందం ఆకస్మికంగా పరిశీలించింది. హాస్పిటల్ లోని పరిసరాలను పరిశీలించారు. రికార్డులను తనిఖీ చేశారు. రోగులకు అందుతున్న ఆహారం నాణ్యత ను పరిశీలించారు. రోగుల వద్ద కు వెళ్లి వైద్య సేవలు గురించి అడిగి తెలుసుకున్నారు. మందుల పంపిణీ... ఎన్ని రకాల మందులు ఉన్నాయి. ఎంత మందికి అందిస్తున్నారు. ప్రతీ రోజు ఓపీ ఎంతంటుంది. వారికి అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. హస్పిటల్ లో పారిశుద్ధ్యం ను పరిసరాలు తిరిగి పరిశీలించారు. అనంతరం వైద్యాధికారులతో ప్రత్యేక –సమావేశం ను నిర్వహించారు. కాయకల్ప కు అవసరమైన సౌకర్యాలు గురించి చర్చించారు. వైద్య సేవల పట సంతృప్తిని వ్యక్తం చేసినట్లు వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ మంగళ, డాక్టర్.కె.రాజేష్, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



## పంచాయతీరాజ్ చట్టం–2018పై వార్డు సభ్యులకు శిక్షణ ప్రారంభం

**అశ్వాపురం,ఫిబ్రవరి16(నినాదం):**

తెలంగాణ పంచాయతీరాజ్ కమిషనర్ మరియు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పంచాయతీరాజ్ చట్టం–2018పై అవగాహన కల్పించేందుకు అశ్వాపురం మండలంలోని నూతనంగా ఎన్నికైన వార్డు సభ్యులకు ఐదు రోజులపాటు శిక్షణ కార్యక్రమాన్ని మండల ప్రజాపరిషత్ కార్యాలయ ఆవరణలో రెండు విడతలుగా నిర్వహిస్తున్నారు.మొదటి విడత శిక్షణ కార్యక్రమం ఫిబ్రవరి 16 నుండి 20 వరకు జరుగుతుండగా, ఈ కార్యక్రమాన్ని ఎంపీడీఓ జి. ముత్యాల రావు ప్రారంభించారు. ఈ విడతలో 12 గ్రామ పంచాయతీలకు చెందిన వార్డు సభ్యులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ, ఐదు రోజులపాటు జరిగే శిక్షణను సభ్యులు సమర్ధంగా వినియోగించుకుని పంచాయతీరాజ్ చట్టంలోని నిబంధనలు, బాధ్యతలు, గ్రామాభివృద్ధి కార్యక్రమాల అమలు విధానాలపై సమగ్ర అవగాహన పొందాలని సూచించారు. గ్రామ పంచాయతీ అభివృద్ధిలో వార్డు సభ్యుల పాత్ర అత్యంత కీలకమని, ప్రజల సమస్యల పరిష్కారంలో చురుకుగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు.రెండవ విడత శిక్షణ కార్యక్రమం మిగిలిన 12 గ్రామ పంచాయతీల వార్డు సభ్యులకు ఫిబ్రవరి 23 నుండి 27 వరకు నిర్వహించబడుతుందని అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి. ముత్యాల రావుతో పాటు యూడీసీ డి. పద్మావతి, అశ్వాపురం గ్రామపంచాయతీ కార్యదర్శి దాసరి మల్లేశం, టీఓటీలు మరియు వివిధ గ్రామాల గ్రామ పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

## అభివృద్ధి సంక్షేమం మేలు కలయికతో
# మరింత బాధ్యతతో పని చేస్తాం

### పట్టణ ప్రాంతాల్లో కాంగ్రెస్ బలహీనంగా ఉందన్న దుష్ప్రచారానికి ఈ ఫలితాలు చెంపపెట్టు
### మధిర పాత్రికేయుల సమావేశంలో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క

**మధిర, ఫిబ్రవరి 16 (నినాదం):**

మధిర పురపాలక సంఘ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని భారీ మెజారిటీతో గెలిపించిన ఓటర్ మహాశయులకు కృతజ్ఞతలు చెబుతూ ఈ సందర్భంగా ఆయన కాంగ్రెస్ పార్టీ కేవలం గ్రామీణ ప్రాంతాల్లోనే బలంగా ఉంది పట్టణ ప్రాంతంలో బలహీనంగా ఉంది అని కొన్ని పార్టీలు చేసిన ప్రచారానికి ఈ మున్సిపల్ ఎన్నికల్లో ప్రజలు చంపపెట్టుగా తీర్పునిచ్చారు. శాసనసభ ,పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల తో పాటు పట్టణ ప్రాంతంలో జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో భారీ మెజారిటీ సాధించి కాంగ్రెస్ పార్టీ రాష్ట్రంలో తన బలాన్ని నిరూపించింది. రాష్ట్రంలో 90 నుంచి 95 మున్సిపాలిటీలను కాంగ్రెస్ పార్టీ కైవసం చేసుకుంది రాష్ట్ర చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా పట్టణ ప్రాంతాల్లో ఏ పార్టీకి రాని భారీ మెజారిటీని ఈ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ఓట్లు వేసి విజయం అందించిన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. అభివృద్ధి సంక్షేమం, నమ్మకం అత్యంత ప్రధానమైన రెండు అంశాలతో గత రెండు సంవత్సరాలుగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సహచర క్యాబినెట్ మంత్రులందరూ సమిష్టిగా అర్బన్ సెంటర్స్ ను అభివృద్ధి చేసిన దానికి ఫలితంగా ప్రజలు గుర్తించి ఆదరించారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం ఉంచి ఓటు వేసిన



వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా అభివృద్ధి సంక్షేమం మేలు కలయికతో మరింత బాధ్యతతో రాష్ట్ర ప్రభుత్వం పని చేస్తుంది. రాష్ట్రంలో వేగంగా విస్తరిస్తున్న పట్టణీకరణను సమతుల్యతతో అభివృద్ధి చేయడానికి మున్సిపల్ శాఖ బాధ్యతలు చూస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్యూర్ , క్యూ రేర్ విధానం తీసుకొచ్చి పట్టణాల అభివృద్ధికి బాటలు వేస్తున్నారు. 2047 నాటికి 3 ట్రిలియన్ డాలర్ ఎకానమీగా తెలంగాణ రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తాం.ఈ దేశం తోనే కాదు ప్రపంచంలోనే అభివృద్ధి చెందిన దేశాలతో పోటీపడే విధంగా రూపొందించిన2047 విజన్ డాక్యుమెంట్లు అత్యంత ప్రతిభావంతంగా ఈ ప్రభుత్వం ముందుకు తీసుకెళుతున్నది రాష్ట్రంలో ఉద్యోగాల కల్పనకై పారిశ్రామికీకరణ, అందుకు కావలసిన ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఏర్పాటుపై కూడా ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సాధించి ముందుకెళుతున్నది. రాష్ట్ర ప్రజలంతా అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా వారు కోరారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ వాసిరెడ్డి రామనాథం, కొండపాల కోటేశ్వర రావు, బండారు నరసింహారావు, సూరంశెట్టి కిషోర్, కోన ధని కుమార్, మిరియాల రమణ , సామినేని సుజాత, తదితర కాంగ్రెస్ నాయకులు అందరూ పాల్గొనడం జరిగింది.

## దివ్యాంగుల సహాయ ఉపకరణాల కోసం
# దరఖాస్తుల పరిశీలన

### జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 16(నినాదం)**

జోగులాంబ గద్వాల జిల్లాలో దివ్యాంగుల సహాయ ఉపకరణాల కోసం దరఖాస్తు చేసుకున్న అభ్యర్థుల ఎంపిక నిమిత్తం సర్టిఫికేట్ పరిశీలన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద సోమవారంఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరిశీలన కార్యక్రమం ఈ నెల 18వ తేదీన ఐడిఓసి లోని మహిళా, శిశు, దివ్యాంగుల మరియు వయోవృద్ధుల సంక్షేమ శాఖ కార్యాలయం, రూమ్ నెం. 33లో నిర్వహించబడుతుందని జిల్లా సంక్షేమ శాఖ అధికారి సునంద తెలిపారు. హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో పాటు ఒక సెట్ జిరాక్స్ ప్రతులను మరియు ఆన్లైన్ అప్లికేషన్తో పాటు సదరం సర్టిఫికేట్, ఆధార్, రేషన్, కుల, ఆదాయ ధృవీకరణ పత్రం, విద్యా ధ్రువ పత్రాలు, బోనఫైడ్ సర్టిఫికెట్ మరియు మొబైల్ బిజినెస్ బ్యాటరీ ట్రై సైకిల్స్ కు దరఖాస్తు చేసిన వారు రూ.100/- బాండ్ పేపర్ పై నిరుద్యోగ ధ్రువీకరణ పత్రం తప్పనిసరిగా తీసుకొని రావలెను. పరిశీలనకు హాజరుకాని అభ్యర్థులను అనర్హులుగా పరిగణించబడుతారని ఆమె స్పష్టం

## ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలను
# విజయవంతం చేయాలి

### ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి బానోత్ రఘురాం

**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 16 (నినాదం):**

తెలంగాణ రాష్ట్ర అఖిల భారత విద్యార్థి సమాఖ్య 4వ మహా సభలను విజయవంతం చేయాలని ఏఐఎస్ఎఫ్ బానోత్ రఘురాం అన్నారు. జిల్లా కేంద్రంలోని పూలాంగ్ చౌరస్తాలోని టీటీడీ కళ్యాణ మండపంలో ఈ నెల 18 నుంచి 20 వరకు మహాసభలు జరుగుతాయన్నారు. ఈ నెల 18న నగరంలోని ప్రెస్ క్లబ్ నుంచి భారీ విద్యార్థి ప్రదర్శన మహాసభలు జరిగే సభ వరకు నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆయన కోరారు.

## భూ పోరాటంలో... కామ్రేడ్ నరసింహ కృషి మరువలేనిది

### సిపిఐ మేడ్చల్ నియోజకవర్గ ఇన్చార్జి టి. శంకర్

**జవహర్ నగర్, ఫిబ్రవరి 16 (నినాదం):**



భూ పోరాటంలో కామ్రేడ్ నరసింహ కృషి ఎనలేనిదని ఆయన మరణం సిపిఐ పార్టీకి తీరని లోటు అని సిపిఐ మేడ్చల్ నియోజకవర్గం ఇంచార్జ్ తోటపల్లి శంకర్ అన్నారు. మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధి జవహర్ నగర్ లోని రావి నారాయణరెడ్డి (సిపిఐ) కాలనీలో నివసించే నరసింహ (55) అనారోగ్యంతో బాధపడుతూ సోమవారం మృతి చెందాడు. విషయం తెలిసిన పార్టీ శ్రేణులు నరసింహ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నిమ్మల నరసింహ, కురుమయ్య, రవి నాయక్ ,లక్ష్మణ్, సాయికిరణ్, కాలనీ వాసులు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# నినాదం
తెలంగాణ ప్రాంతీయం
నిఖార్సైన జర్నలిజం
మంగళవారం 17
ఫిబ్రవరి 2026


# సర్వోత్తముని స్ట్రాటజీ

**పుర పోరులో చాణిక్య నీతి**

**ముందుగానే మున్సిపల్ చైర్మన్ ప్రకటన**

**గతంలో గులాబీ పార్టీ చేసిన తప్పును ఎత్తిచూపడంలో విజయం**

**ఒక వర్గం ఓట్లు రాబట్టడంలో కీలక పాత్ర**






**సూర్యాపేట ప్రతినిధి ఫిబ్రవరి 16 ( నినాదం):** 2026 మున్సిపల్ ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ 48 వార్డులకు గాను 31 వార్డులలో గెలుపొందిన విషయం అందరికి తెలిసిందే. ప్రతిపక్ష గులాబీ పార్టీకి కాంగ్రెస్ పార్టీకి మధ్య హోరాహోరీ పోటీ ఉంటుందని అందరూ భావించిన తరుణంలో ఏఐసీసీ నాయకులు రామ్ రెడ్డి సర్వోత్తమ్ రెడ్డి పొలిటికల్ స్ట్రాటజీని ఉపయోగించారు అనడంలో అతిశయోక్తి లేదు. మున్సిపల్ చైర్ పర్సన్ పదవిని పార్టీకి చెందిన ముఖ్య నాయకులు పేర్లు తెరమీదకు వచ్చిన అందరినీ కాదని ఆర్యవైశ్య సామాజిక వర్గానికి చెందిన మొరిశెట్టి లక్ష్యాదినివేదిత పేరును తెరమీదికి తీసుకువచ్చి ఓటు బ్యాంకును రాబట్టడంలో విజయం సాధించారు.

**పుర పోరులో కీలక పాత్ర**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసిన నాటి నుండి అభ్యర్థుల ఎంపిక పట్ల ఆయన జాగ్రత్త వహించారు . అధికార పార్టీ నుండి రెండు నుండి మూడు నామినేషన్లు వచ్చిన అందరిని ఒప్పించి గెలుపు గుర్రాలకే టికెట్లు కేటాయించి కీలకపాత్ర పోషించారు. ప్రతి వార్డులో ప్రచార నిర్వహణ శైలిని ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ తానే స్వయం గా ప్రచారంలో పాల్గొని కార్యకర్తలలో జోష్ నిం పారు.

**ముందుగానే మున్సిపల్ చైర్మన్ ప్రకటన**

ముందుగానే మున్సిపల్ చైర్మన్ అభ్యర్థి మొరిశెట్టి లక్ష్యాదినివేదిత పేరును ప్రకటించి అందరినీ ఆశ్చర్యానికి గురి చేశారు. అప్పటివరకు కాంగ్రెస్ పార్టీ నుండి ప్రముఖ వ్యక్తులు పోటీలో నిలబడిన వారిని కాదని అధిష్టానాన్ని సైతం ఒప్పించి పేరును ప్రకటించి శభాష్ అనిపించుకున్నారు. గులాబీ పార్టీ తప్పును ఎత్తి చూపడం 2019 మున్సిపల్ ఎన్నికలలో 39 వ వార్డు నుండి కౌన్సిలర్ అభ్యర్థి మొరిశెట్టి సుధారాణి శ్రీనివాస్ పేరును ప్రకటించి ఎన్నికల అనంతరం రాజకీయ పరిణామాల మధ్యలో వారి పేరును తొలగించడం తో ఆ సామాజిక వర్గానికి చెందిన ఓటర్లు కొంత అసహనానికి గురైన బయటకు చెప్పలేని పరిస్థితి ఏర్పడడంతో 2026 మున్సిపల్ ఎన్నికలలో తమ ఓటు బ్యాంకు ను కాంగ్రెస్ కు మళ్ళించారు. గులాబీ పార్టీ చేసిన తప్పును రాజకీయంగా ప్రజలకు చూపించడంలో రాంరెడ్డి సర్వోత్తమ్ రెడ్డి విజయం సాధించారని ఆ సామాజిక వర్గం హర్షం వ్యక్తం చేసినట్లు తెలుస్తుంది. ఏది ఏమైనా తండ్రి రామ్ రెడ్డి దామోదర్ రెడ్డి రాజకీయ శైలిని భవిష్యత్తులో కొనసాగించాలని కోరుకుందాం.

## కౌన్సిలర్‌గా ప్రమాణ స్వీకారం చేసిన సూగూరు మురళి సాగర్



**వనపర్తి ప్రతినిధి, ఫిబ్రవరి 16 (నినాదం) :** వనపర్తి పట్టణంలోని గాంధీ నగర్ 19వ వార్డు నుండి బీఆర్ఎస్ తరపున పోటీ చేసి గెలుపొందిన సూగూరు మురళి సాగర్ కౌన్సిలర్ గా ప్రమాణ స్వీకారం చేశారు. సోమవారం పురపాలక సంఘం కార్యాలయంలో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు ప్రమాణ స్వీకారం నిర్వహించారు. ఈ సందర్భంగా 19వ వార్డు బీఆర్ఎస్ కౌన్సిలర్ సూగూరు మురళి సాగర్ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా 19వ వార్డు ప్రజలకు, పట్టణ ప్రజలకు, బీఆర్ఎస్ నాయకులు,కార్యకర్తలకు కృతజ్ఞతలు తెలిపారు

## మహాశివుని చల్లని ఆశీస్సులు అందరిపై ఉండాలి

**-సర్పంచ్ జుట్టు రామస్వామి.**

**-ఘనంగా అమృత పంచలింగేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు**

**చేవెళ్ల ఫిబ్రవరి 16 (నినాదం):-**మహాశివుని చల్లని ఆశీస్సులు ప్రజలందరి పైన ఉండాలని ప్రతి ఇంట్లో ఆధ్యాత్మికత వెల్లివిరియాలి అని సర్పంచ్ జుట్టు రామస్వామి ఆకాంక్షించారు.చేవెళ్ల మండలం అంతారం గ్రామంలోని శ్రీ అమృత పంచలింగేశ్వర ఆలయంలో మహా శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. శశిభూషణాచారి, రాఘవాచారి, భాను చారి ఆధ్వర్యంలో బిల్వార్చన, కుంకుమార్చన, రుద్ర హోమం, అభిషేకాలు భక్తిశ్రద్ధలతో జరిగాయి. గ్రామానికి చెందిన ఉగ్గి హైమావతివజ్రలింగం దంపతులు అగ్ని గుండం నిర్వహించి స్వామివారికి ప్రత్యేక అభిషేకం చేశారు.సర్పంచ్‌ఉప సర్పంచ్ దంపతులు జుట్టు మంజులరామస్వామి, కావలి స్వరూపవెంకటేష్ బాబు పట్టు వస్త్రాలు సమర్పించి పార్వతీపరమేశ్వరుల కల్యాణం జరిపించారు. భక్తుల సౌకర్యార్థం ఆలయ ఆవరణలో గ్రామ సర్పంచ్ జుట్టు రామస్వామి ఆధ్వర్యంలో అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు చుట్టుపక్కల గ్రామాల నుంచి వచ్చిన ప్రజలు, శివభక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు..

## మామిండ్ల వీరయ్య పల్లి గ్రామానికి ట్రాక్టర్ కోసం వినతి

**-చెత్త సేకరణలో ఇబ్బందులు ప్రైవేట్ వాహనాలతో అదనపు భారం**



**నల్లబెల్లి, ఫిబ్రవరి 16 (నినాదం):**
వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలం మామిండ్ల వీరయ్య పల్లి గ్రామపంచాయతీ పరిధిలో తడి చెత్త, పొడి చెత్త సేకరణ కార్యక్రమం నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు,ఎదురవుతున్నాయి. గ్రామపంచాయతీకి స్వంత ట్రాక్టర్ వాహనం లేకపోవడం వల్ల చెత్త సేకరణ పనులు సమయానికి పూర్తి చేయడం కష్టంగా మారింది. ప్రస్తుతం ప్రైవేట్ వాహనాలను కిరాయికి తీసుకుని చెత్త సేకరణ నిర్వహించాల్సి వస్తోంది. దీనివల్ల గ్రామపంచాయతీ నిధులపై అదనపు ఆర్థిక భారం పడుతోంది.గ్రామంలో స్వచ్ఛతను కాపాడడం కోసం సర్పంచ్ ఏడాకుల సరోజన సంపత్ రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్తులు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గ్రామ అభివృద్ధి, పరిశుభ్రత కార్యక్రమాలు నిరంతరం కొనసాగాలంటే స్వంత ట్రాక్టర్ అవసరమని ఏకగ్రీవంగా తీర్మానించారు. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి ,పంచాయతీ రాజ్ శాఖ మంత్రి ధనసరి సీతక్క గ్రామపంచాయతీ ప్రతినిధులు వినతిపత్రం ద్వారా అభ్యర్థించారు. గ్రామానికి ట్రాక్టర్ మంజూరు చేస్తే చెత్త సేకరణ కార్యక్రమం సక్రమంగా నిర్వహించడంతో పాటు గ్రామ పరిశుభ్రత మెరుగుపడుతుందని పేర్కొన్నారు.గ్రామస్థులు మాట్లాడుతూ,ప్రస్తుతం ప్రైవేట్ వాహనాలపై ఆధారపడటం వల్ల ఖర్చులు పెరుగుతున్నాయి. ప్రభుత్వ సహకారంతో ట్రాక్టర్ మంజూరు చేస్తే గ్రామ అభివృద్ధికి,దోహదపడుతుందిఅని తెలిపారు.ప్రభుత్వం స్పందించి గ్రామానికి ట్రాక్టర్ మంజూరు చేయాలని గ్రామస్థులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

## పారదర్శకమైన పాలన అందిస్తాం

**మున్సిపల్ చైర్మన్ బృంగి రత్నమాల ఆనంద్‌కుమార్**



**నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 16 (నినాదం):**
మున్సిపల్ ఎన్నికల్లో ఏడో వార్డు కాంగ్రెస్ పార్టీ కౌన్సిలర్ అభ్యర్థిగా బరిలో దిగిన నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించిన వార్డు ప్రజల, పట్టణ ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా పారదర్శకమైన పాలన కొనసాగిస్తానని మున్సిపల్ చైర్మన్ గా ఎన్నికైన బృంగి రత్నమాల ఆనంద్ కుమార్ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఆవరణలో మాట్లాడుతూ తనపై ఎంతో నమ్మకంతో స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి లు ఎంతో బాధ్యతాయుతమైన పదవిని ఇచ్చారని వారి నమ్మకాన్ని వమ్ము చేయకుండా పట్టణ ప్రజలు ఆశించిన రీతిలో పాలన కొనసాగిస్తానని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే సహకారంతో ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా అవినీతి రహిత, ఆదర్శవంతమైన పాలన కొనసాగిస్తానని తెలిపారు. రాజకీయాలకతీతంగా పట్టణంలోని అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలు అందించడంతోపాటు అన్ని వార్డులలో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టేందుకు కృషి చేస్తానని అన్నారు. ముఖ్యంగా తాగునీరు, పారిశుధ్యం మౌలిక సదుపాయాల మెరుగుదలకు ప్రాధాన్యత ఇస్తామని పేర్కొన్నారు.

## వడ్డేపల్లి మున్సిపల్ నూతన చైర్మన్ లు గా మంజుల, వైస్ చైర్మన్ గా సారంద

**గద్వాల ప్రతినిధి ఫిబ్రవరి 16 ( నినాదం)**
జోగులాంబ గద్వాల జిల్లా వడ్డేపల్లి మున్సిపాలిటీ నూతన చైర్మన్లు గా మంజుల వైస్ చైర్మన్ గా సారంద సోమవారం ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా వీరితోపాటు వార్డ్ కౌన్సిలర్ గా ప్రమాణ స్వీకారం చేసిన సభ్యులు
1వార్డు కౌన్సిలర్ కురువ పావని
2 వార్డు కౌన్సిలర్ గా సారంద
3 వార్డు కౌన్సిలర్ గా వెంకటరమణ (కాంగ్రెస్)
4 వార్డు కౌన్సిలర్ గా ఎన్ మంజుల
5 వార్డు కౌన్సిలర్ గా ఎన్ యుగేందర్ రెడ్డి
6 వార్డు కౌన్సిలర్ గా దేవమ్మ
7 వార్డు కౌన్సిలర్ గా డాక్టర్ విజయకుమార్
8 వార్డు కౌన్సిలర్ గా నంబి జయశ్రీ
9వ వార్డు కౌన్సిలర్ గా వడ్డేపల్లి సూరి( బిఆర్ఎస్)
10 కౌన్సిలర్ గా ఎరుకలి తిమ్మప్ప కౌన్సిలర్లుగా ప్రమాణస్వీకారం చేశారు.

## ఏఐఎస్ఎఫ్ మహాసభల గోడప్రతుల ఆవిష్కరణ

**మహాసభల ఆహ్వాన సంఘం**

**గౌరవ అధ్యక్షుడు మారయ్య గౌడ్**



**నిజామాబాద్ ప్రతినిధి, ఫిబ్రవరి 16 (నినాదం) :** ఈ నెల 18, 19, 20వ తేదల్లో జరిగే అఖిల భారత విద్యార్థి సమాఖ్య రాష్ట్ర మహాసభల గోడ పత్రులను ఆహ్వాన సంఘం గౌరవ అధ్యక్షుడు మారయ్య గౌడ్ సోమవారం జిల్లా కేంద్రంలోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర మహాసభలు నిజామాబాద్ పట్టణంలో నిర్వహించడం సంతోషకరమన్నారు. దేశంలో మొట్టమొదటి విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్ అని నేడు గత 90 సంవత్సరాలుగా విద్యార్థుల సమస్యల కోసం అలుపెరుగని పోరాటాలు నిర్వహిస్తున్న ఏకైక సంఘం అన్నారు. విద్యను హక్కుగా సాధించేందుకు, విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటాలకు దిశానిర్దేశం చేసే మహాసభలుగా ఇవి నిలవనున్నాయన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అవలంబిస్తున్న విద్యావ్యతిరేక విధానాలపై చర్చించి పోరాటాలకు సన్నద్ధమవ్వడానికి రాష్ట్రంలో పెరుగుతున్న ఫీజులు, పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్మెంట్ నిధులు ,నిరుద్యోగ సమస్య, హాస్టల్ సౌకర్యాల లోపాలు,ప్రభుత్వ విద్యాసంస్థల నిర్లక్ష్యం వంటి అంశాలపై మహాసభల్లో సమగ్ర చర్చ జరగనుందన్నారు. విద్య రంగాన్ని ప్రభుత్వం కాపాడటం కోసం విద్య రంగంలో సమూల మార్పులు తీసుకురావడం కోసం ఈ మహాసభలో ఏఐఎస్ఎఫ్ ప్రతినిధులు చర్చించిస్తారన్నారు. రాష్ట్రం నలుమూలల నుండి 750మంది విద్యార్థి ప్రతినిధులు ఈ మహాసభలో పాల్గొని విజయవంతం చేయాలని మారయ్య గౌడ్ విద్యార్థి లోకానికి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆహ్వాన సంఘం అధ్యక్షులు సుధాకర్, రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంజర భూమయ్య, ఏఐఎస్ఎఫ్ నిజామాబాద్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సుభోద్,రఘురాం, జిల్లా సహాయ కార్యదర్శి కుశాల్, సంజయ్,ఉపాధ్యక్షుడు కార్తీక్, అనూష, నాయకులు కిషోర్, నిఖిల్, దినేష్,చందు,తదితరులు పాల్గొన్నారు.

## బిజెపి కౌన్సిలర్లకు ఘనంగా సన్మానం

**-శుభాకాంక్షలు తెలియజేసిన డాక్టర్ వైభవరెడ్డి**



**చేవెళ్ల ఫిబ్రవరి 16 (నినాదం):-**
చేవెళ్ల మున్సిపల్ ఎన్నికలలో భారతీయ జనతా పార్టీ తరుపున గెలుపొందిన కౌన్సిలర్,సోమవారం మున్సిపల్ పాలకవర్గ ప్రమాణ స్వీకారం అటాహసంగా సాగింది. ఈ నేపథ్యంలో భారతీయ జనతా పార్టీ , రంగారెడ్డి జిల్లా యువ నాయకులు డాక్టర్ వైభవరెడ్డి, స్థానిక నాయకులతో కలిసి వారికి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పూలబొకే అందజేసి,శాలువాతో సత్కరించి వారికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ,చేవెళ్ల ప్రజలు బీజేపీపై ఉంచిన నమ్మకానికి ఇది నిదర్శనం అని, గెలుపొందిన కౌన్సిలర్లు ప్రజల ఆశయాలకు అనుగుణంగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టి, పారదర్శక పాలన అందించాలని ఆశిస్తున్నాను. మున్సిపల్ పరిధిలో సమగ్ర అభివృద్ధి కోసం పార్టీ తరపున సంపూర్ణ సహకారం అందిస్తాం" అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానికులు పాల్గొన్నారు.

## నాగరాజ్‌పల్లిలో ఉపాధి హామీ పనులకు ఊపు



**నల్లబెల్లి, ఫిబ్రవరి 16 (నినాదం):**
వరంగల్ జిల్లా నల్లబెల్లి మండలంలోని నాగరాజ్‌పల్లి గ్రామంలో మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) పనులు గత ఐదు రోజులుగా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. గ్రామ సర్పంచ్ ఎరుకల లలిత రఘునా ఆధ్వర్యంలో పంతులు పల్లె పరిధిలోని ధర్మసముద్రం కుంట వద్ద అభివృద్ధి కార్యక్రమాలు ప్రారంభించబడ్డాయి.గ్రామాభివృద్ధి, గ్రామీణ ప్రజలకు ఉపాధి కల్పన అనే ద్వంద్వ లక్ష్యాలతో ఈ పనులు చేపట్టినట్లు గ్రామ అధికారులు తెలిపారు. ప్రస్తుతం కుంటలో మట్టితీసివేత, చెత్త తొలగింపు, గట్టు బలపరచడం, నీటి నిల్వ సామర్థ్యాన్ని పెంచే చర్యలు వేగంగా కొనసాగుతున్నాయి. వర్షాకాలానికి ముందుగానే కుంటను సిద్ధం చేయడం ద్వారా నీటి నిల్వ పెరిగి భూగర్భ జలాల మట్టం మెరుగుపడే అవకాశముందని గ్రామ పెద్దలు అభిప్రాయపడు తున్నారు. ఈ పనుల ద్వారా గ్రామంలోని నిరుద్యోగ యువకులు, మహిళలకు ఉపాధి లభిస్తోంది. రోజువారీ కూలి పనుల ద్వారా కుటుంబాల ఆర్థిక స్థితి మెరుగుపడుతుందని కార్మికులు తెలిపారు. గ్రామంలో పెద్ద సంఖ్యలో కార్మికులు హాజరై పనులు నిర్వహిస్తున్నారు.సర్పంచ్ ఎరుకల లలిత రఘునా మాట్లాడుతూ, ధర్మసముద్రం కుంట పునరుద్ధరణతో రైతులకు సాగునీరు అందుబాటులోకి వస్తుంది. ప్రభుత్వం అందిస్తున్న ఉపాధి హామీ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటూ గ్రామ అభివృద్ధికి కృషి చేస్తున్నాం. రాబోయే రోజుల్లో మరిన్ని అభివృద్ధి పనులు చేపడతాం అని తెలిపారు.గ్రామ ప్రజలు ప్రభుత్వం చేపట్టిన ఈ పథకాన్ని సమర్థంగా అమలు చేసి గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని కోరుతున్నారు. నాగరాజ్‌పల్లి గ్రామంలో ఉపాధి హామీ పనులు వేగంగా సాగుతుండటంతో గ్రామంలో ఉత్సాహభరిత వాతావరణం నెలకొంది.

## భీంగల్ మున్సిపల్ చైర్మన్‌గా బోదిరే నాగమణి

**భీంగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా సంటిలత**





**ఆర్మూర్, ఫిబ్రవరి 16(నినాదం):** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం భీంగల్ మున్సిపల్ చైర్మన్ గా బోదిరే నాగమణి, భీంగల్ మున్సిపల్ వైస్ చైర్మన్ గా సంటి లత నరసయ్యలు, సోమవారం రోజున భీంగల్ మున్సిపాల్ కార్యాలయంలో ప్రెసిడింగ్ అధికారుల సమక్షంలో మున్సిపల్ కౌన్సిలర్లతో సమావేశం ఏర్పాటు చేసి, అందరి అభిప్రాయం వరకు భీంగల్ మున్సిపల్ చైర్మన్ గా బోదిరే నాగమణి, వైస్ చైర్మన్ గా సంటి లత నరసయ్యలను కౌన్సిలర్లు ఏకగ్రీవంగా ఎన్నుకోవడంతో, వీరిని చైర్మన్ వైస్ చైర్మన్ గా అధికారులు ప్రకటించారు. అనంతరం చైర్మన్,వైస్ చైర్మన్ తో పాటు, కౌన్సిలర్ లచే ప్రెసి అధికారులు పదవి ప్రమాణస్వీకారం చేయించిన అనంతరం, బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా బాల్కొండ నియోజకవర్గ ఇంచార్జ్ కాంగ్రెస్ పార్టీ నాయకులు ముత్యాల సునీల్ కుమార్ రెడ్డి, టీజీఎండిసి రాష్ట్ర చైర్మన్ ఈరవత్రి అనిల్, రాష్ట్ర విత్తన అభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్ రెడ్డి, వీరితోపాటు ప్రెసి డింగ్ అధికారులు, జెడ్పి సీఈవో సాయ గౌడ్, మున్సిపల్ కమిషనర్ గోపు గంగాధర్, వివిధ శాఖల అధికారులు భీమ్గల్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్ తో పాటు, కౌన్సిలర్లకు సైతం పుష్పగుచ్చాలు అందించి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ బోదిరే నాగమణి, వైస్ చైర్మన్ సంటిలతా లు మాట్లాడుతూ, కౌన్సిలర్లను కలగలుపుకొని, అందరి నాయకుల, నేతల సహకారంతో భీంగల్ మున్సిపాలిటీ పరిధిలో అభివృద్ధికి సమిష్టిగా కృషి చేస్తామని వారు తెలిపారు.

## రూ.1000 తీసుకొని ఓటు వేయలేని వారు సర్వనాశనం అయిపోతారు



**మంచిర్యాల, ఫిబ్రవరి 16(నినాదం):**
డబ్బులు తీసుకొని ఓటు వేయలేని వారు సర్వనాశనం అవుతారని వీడియో సామాజిక మాధ్యమంలో వైరల్ అవుతుంది. మంచిర్యాల కార్పొరేషన్ పరిధిలోని 27వ డివిజన్ లో బీజేపీ అభ్యర్థి ఓటుకు రూ.1000 పంపిణీ చేశాడు. కార్పొరేషన్ ఎన్నికల్లో ఓడి పోయారు. దీంతో సోమవారం బీజేపీ అభ్యర్థి భర్త డివిజన్ కి వచ్చి ఓటర్లతో రూ.1000 తీసుకొని బైబుల్ సాక్షిగా చెబుతున్న ఓటు వేయలేని వారు సర్వనాశనం అయిపోతారని ఓటర్లును ఇష్టం వచ్చిన బూతులు తిట్టాడు. ఈ వీడియో మంచిర్యాల కార్పొరేషన్ లో చర్చనీయాంశమైంది. దీనిపై ఉన్నతాధికారులు ఏ విధంగా స్పందిస్తారు చూడాలి.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 16 (నినాదం ):**
వట్టినాగులపల్లి సబ్ స్టేషన్ పరిధిలోని 11 కెవి పీడర్ పరిధిలోని ప్రాంతాలలో 2:30 నుంచి 6గంటలవరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని ఏఈ మణికంఠ తెలియజేశారు. మంగళవారం ఖానాపూర్ విలేజ్ నుంచి ఓఆర్ఆర్ సర్వీస్ రోడ్, కోకాపేట్ కృష్ణ గో సేవ, వివేకనంద నగర్, పద్మ శ్రీ లేపౌట్, లేన్సన్ ఇంతనియా అపార్ట్మెంట్, ప్రాంతాలలో విద్యుత్ నిలిపియబడుతుంది కాలనీవాసులు ఎలక్ట్రిసిటీ సిబ్బందికి సహకరించాలన్నారు.

## యోగేశ్వర ఆలయంలో అన్న ప్రసాద వితరణ



**దుబ్బాక ఫిబ్రవరి 16( నినాదం):**
తొగుట మండలంలోని వెంకటరావుపేట గ్రామంలో శివరాత్రి సందర్భంగా యోగేశ్వర స్వామి దేవాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. పూజల అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్న ప్రసాద వితరణ కార్యక్రమం జరిగింది. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు..కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోనె లహరి

**-ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్‌గా కాటిపల్లి వెంకటరెడ్డి...**



ఆర్మూర్, ఫిబ్రవరి 16-( నినాదం): నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ మున్సిపల్ చైర్‌పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గోనె లహరి, ఆర్మూర్ మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ కాటిపల్లి వెంకటరెడ్డి లు సోమవారం ఆర్మూర్ సబ్ కలెక్టర్ అభిజ్ఞాన్ మాల్వియా, ప్రెసి డింగ్ అధికారి సమక్షంలో అందరి కౌన్సిలర్ ల అభిప్రాయం మేరకు వీరిని చైర్ పర్సన్, వైస్ చైర్ పర్సన్ గా ఎంపిక చేసి, పదవి బాధ్యతలు స్వీకరింపజేశారు. వీరు ఇరువురు పదవి బాధ్యతలు చేపట్టడం పట్ల పార్టీ శ్రేణులు, తోటి కౌన్సిలర్లు హర్షం వ్యక్తం చేశారు. ప్రజల నమ్మకాన్ని గెలుచుకొని యువ నాయకత్వానికి నిదర్శనంగా నిలిచిన, చైర్ పర్సన్,వైస్ చైర్ పర్సన్ లకు కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆర్మూర్ మున్సిపల్ పట్టణ అభివృద్ధి పై మాట్లాడారు. ఆర్మూర్ మున్సిపల్ పట్టణ పరిధిలో గల రోడ్ల అభివృద్ధికి, డ్రైనేజీల వ్యవస్థకు, స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు అందరి సహకారంతో కృషి చేస్తామన్నారు. ప్రజల సమస్యల పరిష్కారంలో పారదర్శక పాలన అందించడం జరుగుతుందన్నారు.